
రవాణా శాఖ అధికారి కార్యాలయం.. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం.. అక్కడ రద్దీ ఎంతో.. అవినీతి కూడా అంతకు రెండింతలు.. ఆర్టీవో ఆఫీసుకు రావాలంటేనే డబ్బులతో పని. ప్రతి పనికో రేటు.. పైసలిస్తేనే అక్కడ ఫైళ్లు ముందుకు కదిలేది. రూల్స్ అంటూ మాట్లాడితే ఇక పనులు అయినట్లే.. ఏళ్ల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం ఉండదు. ఇదంతా ఓపెన్‌గా జరుగుతున్న వసూళ్ల దందా. ఇంత జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.



నంద్యాల జిల్లా రవాణా శాఖ కార్యాలయం

ఏజెంట్ల హవా..!

- ప్రతి పనికో రేటు
- అవినీతికి కేరాఫ్‌గా ఆర్టీవో కార్యాలయం
- మధ్యవర్తులు ఏం చెబితే అదే..!
- రూల్స్ మాట్లాడితే పనులు అంతే?
- పట్టించుకోని ఉన్నతాధికారులు



నంద్యాల టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో నంద్యాల, ఆత్మకూరు, డోన్ రవాణా రవాణా శాఖ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో నిత్యం వేల వాహ నాలు వారి అవసరాల నిమిత్తం సుదూర ప్రాంతాల నుంచి వచ్చి పనులు చేసుకుంటున్నారు. దీంతో రవాణా కార్యా లయంలో మాత్రం డబ్బులు ఇవ్వనిది, ఏజెంటును కలవనిది ఏ పని కావడం లేదు. ఆటోలు, లారీలు, బైకులు, ట్రాక్టర్లు ఏ వాహనం వచ్చిన పనిమీద కార్యాలయానికి వచ్చిన వారికి ముడుపులు చెల్లించక తప్పడం లేదని వాహనదారులు వాపోతున్నారు.

ఏజెంటును ఏర్పాటు చేసుకొని..

రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వంలో రవాణా శాఖకు సంబంధించిన సేవలన్నీ ఏపీ ప్రభుత్వం నిర్ణయించిన వెబ్‌సైట్‌లో నిర్వహించేవారు. కూటమి ప్రభుత్వంలో వాహన్ వెబ్‌సైట్ ద్వారా సేవలను అందిస్తున్నారు. వీటిలో కొన్ని సేవలను ప్రైవేటు వారికి కేంద్ర ప్రభుత్వం అప్పజెప్పింది. వీరికి మిగిలిన సేవలన్నింటికి ప్రతి పనికి ఒక ఏజెంటును ఏర్పాటు చేసుకుని వారి ద్వారా వసూళ్లకు పాల్పడుతున్నారు. వాహనం మార్పిడి సమయంలో ఈకేవైసీకి రూ.300, ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ఓనర్ షిప్, పేరు మార్పిడి, అగ్రిమెంట్ వంటి సేవలకు ప్రతి పనికి రూ.400 వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. ఈ వసూళ్లన్నీ ఏవోకు, క్లర్కుకు అందజేస్తున్నారు.



నంద్యాల ఆర్టీవో కార్యాలయం పక్కనే ఉన్న బంకులు

కేసులు రాయకుండా టోకెన్ అని..

ప్రతి కార్యాలయానికి రోజుకు ఎల్ఎల్ఆర్‌లు 40 వస్తున్నాయి. వీటికి రూ.240, డ్రైవింగ్ టెస్ట్‌కు 60 వరకు వాహనాలు వస్తున్నాయి ఫోర్ వీలర్‌కు రూ.380, ఫోర్ ప్లస్ టూ వీలర్‌కు రూ.480 ఏజెంట్ ద్వారా వసూళ్లు చేస్తున్నారు. నంద్యాలకు నిత్యం రవాణా పనిమీద 150నుంచి 200 వాహనాలు వస్తున్నాయి. వీటన్నింటికి కేసులు రాయకుండా టోకెన్ అని చెప్పి వాహనానికి రూ.10వేలు నుంచి 12 వేలు కట్టించుకుని వాటిపై ఎలాంటి కేసులు నమోదు కాకుండా చేస్తున్నారు. అధిక లోడుతో వచ్చిన ఎవరి ప్రాణాలు తీసినా మేమున్నాం అని అవినీతిలో ఎంవీఐలు దూసుకుపోతున్నారు.

ట్యాక్స్ మినహాయింపు అంటూ...

పెద్ద పెద్ద వాహనాలకు ట్యాక్స్ మినహాయింపు అని చెప్పి దోపిడీ పర్వానికి తెర లేపారు. కొన్నేళ్లుగా కట్టకుండా ఉన్న వాహనాలకు కూడా ప్రతి ఏడాదికి రూ.16500 చెల్లించాలి. కార్యాలయ అధికారులు కేవలం రూ.6300 తీసుకుని ఆయా వాహనాలకు ప్రస్తుత ఏడాదికి మాత్రమే ట్యాక్స్ కట్టించుకొని ప్రభుత్వ ఆదాయానికి సైతం గండి కొడుతున్నారు.

మీపని అంతా మేమే చేస్తాం..

జిల్లాలోని ఆర్టీవో కార్యాలయం చుట్టూ చాలా మంది ఏజెంట్లు బంకులు వేసుకుని మేమే మీ పని అంతా చేస్తాం ఇంత మొత్తం ఖర్చు అవుతుందని చెప్తున్నారు. వీరి అనుమతి లేకుండా ఏ పని కాదు. ఒక వేళ లోపలికి వెళ్లినా అధికారులు మాత్రం ఏదో ఒక సాకు చూపి వెనక్కి పంపిస్తున్నారు. అదే పని ఏజెంటు ద్వారా వెళ్తే మాత్రం అయిపోతుంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కొత్త వాహనాలకు ఇలా....

నంద్యాల జిల్లాలో ఏ కొత్త వాహనం కొనుగోలు చేసిన అక్కడే రిజిస్ట్రేషన్ అయిపోతుంది. కొన్ని పనులు ఆర్టీవో కార్యాలయంలో చేయాల్సి ఉంది. వాటికి షోరూం నుంచి ఆర్టీవో కార్యాలయ అధికారులు ద్విచక్ర వాహనానికి రూ.200, ఫోర్ వీలర్‌కు రూ.500, పెద్ద వాహనాలైతే ఏకంగా రూ.5వేల వరకు ఏజెంట్ల ద్వారా వసూలు చేస్తున్నారు.

రవాణా కార్యాలయంలో ఏసీబీ దాడులు ఇలా..

- నంద్యాల జిల్లా కాకముందు ఒక క్లర్కు లంచం తీసుకుంటుండగా ఏసీబీ దాడులు చేసి పట్టుకున్నారు. అదే క్లర్కు ప్రస్తుతం ఇక్కడే పని చేయడం గమనార్హం.
- నంద్యాల ఆర్టీవో కార్యాలయంలో పని చేస్తున్న ఏంవీఐ కూడా ఫైల్ ముందుకు కదలలాంటే లంచం అడిగి ఏసీబీకి చిక్కి జైలు పాలయ్యాడు.
- ఆర్టీవో కార్యాలయంలో పనిచేసి కర్నూలు చెక్ పోస్టు వద్ద ఇంకో ఎంవీఐ సైతం అధికంగా డబ్బులు వసూలు చేసి ఏసీబీ చిక్కి జైలుకు వెళ్లాడు.

మిగతా 6వ పేజీలో

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

- మూడో అదనపు జిల్లా న్యాయాధికారి అమ్మన్నరాజా

నంద్యాల క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 13వ తేదీన నిర్వహించే మెగా జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మూడో అదనపు జిల్లా న్యాయాధికారి అమ్మన్నరాజా అన్నారు. శనివారం నంద్యాలలోని కోర్టు హాలులో న్యాయవాదులు, బ్యాంకులు, బీమా కంపెనీల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీపడదగిన క్రిమినల్ కేసులతో పాటు వాహన ప్రమాదాలు, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదాలు వంటి వివిధ రకాల కేసులు లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవడానికి సులభమార్గమన్నారు. లోక్‌అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించడానికి న్యాయవాదులు కక్షిదారులను ప్రోత్సహించాలని కోరారు. రాజీయే రాజమార్గమన్నారు. ప్రిన్సిపల్ సీనియర్, జూనియర్ సివిల్ న్యాయాధికారులు తంగమణి, శ్రీనివాసులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హుసేన్‌బాషా, సుబ్బారాయుడు, ఏజీపీ బాలగురెడ్డి, వెంకటేశ్వర్లు, మనోహర్‌రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, శివశంకర్ రెడ్డి, గౌరీశంకర్, రాజగోపాల్‌రెడ్డి, ద్వారకానాథ్, తిరుపతి, తిమ్మారెడ్డి, బ్యాంకు, బీమా కంపెనీల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్‌పై దాడి

- బస్సు లైట్లు, అద్దాలు ధ్వంసం

కర్నూలు క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కండక్టర్‌పై ప్రయాణికురాలి బంధువులు దాడి చేసిన సంఘటన కర్నూలు నగరంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. కండక్టర్‌పై దాడితో ఆగకుండా వీరంగం సృష్టించి బస్సు అద్దాలను కూడా ధ్వంసం చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా... అనంతపురం నుంచి కర్నూలుకు ఆర్టీసీ బస్సు బయల్దేరింది. డోన్‌లో ఓ మహిళ బస్సును ఎక్కింది. బస్సులో రద్దీ ఎక్కువగా ఉండటంతో కండక్టర్ మురళీకృష్ణ అందరినీ వెనక్కు తోశారు. ఈ క్రమంలో ఆ ప్రయాణికురాలు ఆగ్రహంతో ఊగిపోయింది. తనపై చేయి వేస్తావా అంటూ కండక్టర్‌పై వాగ్వాదానికి దిగింది. వివాదం పెద్దదిగా మారడంతో పంచాయితీ డోన్ పోలీస్ స్టేషన్‌కు చేరింది. అక్కడి పోలీసులు ఇద్దరికి సర్ది చెప్పి పంపించేశారు. అయితే డోన్-కర్నూలు మధ్యలో కూడా ఆ ప్రయాణికురాలికి, కండక్టర్ మధ్య వాగ్వాదం ఏమాత్రం తగ్గలేదు. ఒకరిపై ఒకరు మరింత ఘర్షణ పడ్డారు. దీంతో ఆ ప్రయాణికురాలు కర్నూలులో ఉంటున్న తన కొడుకు, భర్తకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. ఆమె కొడుకు, స్నేహితులు వచ్చి గుత్తి పెట్రోల్ బంకు వద్ద బస్సు ఆపి కండక్టర్‌పై ముప్పేట దాడికి పాల్పడ్డారు. బస్సు లైటు అద్దాలను పగులకొట్టారు. ఒక్కసారిగా దాడి చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రయాణికురాలు తనపై కండక్టర్ అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆరోపించింది. అయితే రద్దీ అధికంగా ఉందని వెనక్కు వెళ్లాలని తాను గట్టిగా చెప్పానని కండక్టర్ మురళీకృష్ణ చెబుతున్నాడు. అయితే ఒకరిపై ఒకరు పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

బాలికల విద్యాభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

- 'పది' పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి
- ఎస్ఎస్ఏ ఏపీసీ ప్రేమంతకుమార్
- చాగలమర్రి కేజీబీవీలో తనిఖీలు



కేజీబీవీలో పరీక్షలను పరిశీలిస్తున్న జిల్లా ఏపీసీ, జీసీడీవో

చాగలమర్రి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బాలికల విద్యాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎస్ఎస్ఏ(సర్వశిక్ష అభియాన్) ఏపీసీ(అసిస్టెంటు ప్రాజెక్టు కమిషనర్) ప్రేమంతకుమార్ అన్నారు. శనివారం స్థానిక కేజీ బీవీను జీసీడీవో సువర్చలతో కలిసి తనిఖీ చేశారు. విద్యార్థినులు రాస్తున్న సమ్మెటివ్ పరీక్షలను పరిశీలించారు. ప్రత్యేక అధికారులతో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి వార్షిక ప్రణాళికపై సమీక్ష నిర్వహించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 27 కస్తూర్బా పాఠశాలలు, 19 మోడల్ పాఠశాలలు, 27 జూనియర్ కళాశాలలు ఉన్నాయని తెలిపారు. మార్చిలో జరిగే పది పరీక్షలకు 1,500 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారని, వీరికి ప్రత్యేక తరగతులను నిర్వహించి 100 శాతం ఉత్తీర్ణత సా ధించేందుకు కృషి చేయాలని టీచర్లకు సూచించారు. పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న కాంపౌండ్‌వాల్ పనులు చేపడుతున్నామన్నారు. బాలికల సంరక్షణపై ప్రత్యేక దృష్టి ఉంచామన్నారు. ఏఎంవో మాధవిలత, ఐఈకో ఆర్డినేటర్ జగన్మోహన్‌రెడ్డి, అలెస్కో అధికారి ప్రసన్నకుమార్, ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, ఎస్‌వో స్వప్న, సీఆర్పీలు ఖాసీం, కొండయ్య పాల్గొన్నారు.

స్త్రీ,శిశు సంక్షేమం కోసం కృషి : కలెక్టర్




పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

నంద్యాల నూనెపల్లె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు స్త్రీ, శిశు సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తున్నాయని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివార కలెక్టరేట్‌లో సీడీపీవో, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిలాంటి ప్రేమను అంగన్‌వాడీ కేంద్రాలు అందించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సమావేశాల్లో విద్యా, ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమ శాఖకు ఎక్కువగా బడ్జెట్ కేటాయిస్తున్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పాలిచ్చే తల్లులకు ఎన్నో వేల కోట్లు ఖర్చుచేసి పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నారన్నారు. ఆడాప్షన్ పోస్టర్లను విడుదల చేశారు. వన్‌స్టాప్ సెంటర్ మిషన్ వాత్సల్య వంటి వాటిపై చర్చించారు. కార్యక్రమంలో సీడీపీవో లీలావతి, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శత జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

భగవాన్ సత్యసాయిబాబా శత జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది సత్యసాయిబాబా శత జయంతి సందర్భంగా ప్రతి మండలం, నియోజకవర్గం, జిల్లా స్థాయిలో సేవా సంఘాల సహకారంతో ఘనంగా నిర్వహించాలన్నారు. రైతుల అభ్యున్నతికి దోహదపడే మీకోసం రైతన్న కార్యక్రమాన్ని ఈనెల 24 ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమాలను అందరూ కలిసి విజయవంతం చేయాలన్నారు.

రాష్ట్ర కుర్ణి కార్పొరేషన్ చైర్మన్‌గా మిన్నప్ప



ఎమ్మిగనూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కుర్ణి, కరికాలభక్తుల కార్పొరేషన్ చైర్మన్‌గా ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన కామర్తి మిన్నప్పను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. శనివారం పలు కార్పొరేషన్లకు చైర్మన్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో కుర్ణి కార్పొరేషన్ చైర్మన్‌గా చేనేత సామాజిక వర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కామర్తి మిన్నప్పను నియమించారు. పట్టణంలోని ఎంఎస్‌నగర్‌లో నివాసం ఉంటున్న మిన్నప్ప సాధారణ చేనేత కార్మికుడిగా మంచి గుర్తింపు పొందారు. 25 ఏళ్ల నుంచి టీడీపీలో పలు విభాగాల్లో పదవులు పొందారు. పార్టీకి అంకితభావంతో పని చేసిన ఆయన్ను గుర్తించిన సీఎం చంద్రబాబు రాష్ట్ర కుర్ణి, కరికాలభక్తుల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. ఈ సందర్భంగా మిన్నప్ప మాట్లాడుతూ ఎమ్మిగనూరు చేనేతలను గౌరవించి తనను గుర్తించిన సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డికి, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు

- జేసీ కార్తీక్



చామ కాల్వ భూమిని పరిశీలిస్తున్న జేసీ కార్తీక్

నంద్యాల టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): చామకాల్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ కార్తీక్ హెచ్చరించారు. శనివారం చామకాల్వను అనుకుని ఉన్న భూమిని ఆయన పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ ఆక్రమణకు గురి అయిందన్న ఫిర్యాదు మేరకు పరిశీలించినట్లు తెలిపారు. చామకాల్వకు రక్షణ గోడ నిర్మించాలని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయం వెనుక ఉన్న 50 సెంట్ల స్థలాన్ని పరిశీలించారు. స్థలాన్ని ఇస్కాన్ టెంపుల్ వారు అడిగారన్నారు. స్థలానికి సంబంధించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఆయన వెంట తహసీల్దారు శ్రీనివాసులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించండి

- డీఆర్వో రామునాయక్



మాట్లాడుతున్న డీఆర్వో రామునాయక్

నంద్యాల నూనెపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్పష్టమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) రామునాయక్ అన్నారు. శనివారం ఆయన కార్యాలయ చాంబర్‌లో ఓటర్ల జాబితా రూపకల్పనపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఫార్మ్ 6, 7, 8ను పెండింగ్ ఉండకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు కూడా బూత్‌స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలని, వారు స్థానిక ఓటరు అయి ఉండాలని, అలా లేని పక్షంలో నియోజకవర్గ అభ్యర్థులను నియమించుకోవాలన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు మాట్లాడుతూ మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో ఈవీఎం మిషన్లకు బదులుగా బ్యాలెట్ పేపర్లను ఏర్పాటు చేసేలా చూడాలని డీఆర్వోకు నివేదించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ప్రతినిధి రవి, ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రతినిధి ప్రదీప్, బీఎస్పీ పార్టీ ప్రతినిధి శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి సాయిరాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సయ్యద్ రియాజ్ బాషా, సీపీఐ ప్రతినిధి నరసింహులు, టీడీపీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

- 'పది'లో వందశాతం ఫలితాలు సాధించాలి
- జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈవో

కొత్తపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చెంచుబిడ్డలకు నాణ్యమైన విద్యను అందించాలని విద్యాశాఖ జిల్లా అధికారి జనార్దన్ రెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన మండలంలోని శివపురం గిరిజన ఆశ్రమ పాఠశాలను ఎంఈవో-1 నాగరాజు, ఎంఈవో-2 ఇనయతుల్లాతో కలిసి తనిఖీ చేశారు. 1 నుంచి 10వ తరగతి వరకు 114 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. కేవలం 86 మంది విద్యార్థులే హాజరు కావడంపై డీఈవో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డీఈవో గిరిజన విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. అలాగే స్థానిక అంగన్వాడీ సెంటర్‌ను సైతం పరిశీలించారు. అనంతరం గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఆదేశించారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

వచ్చే ఏడాది మార్చిలో పదో తరగతి పరీక్షలో కొత్తపల్లి మండలం నుంచి వందశాతం విజయం సాధించాలని డీఈవో జనార్దన్ రెడ్డి ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. శనివారం మధ్యాహ్నం కొత్తపల్లి జడ్పీహెచ్ఎస్‌లోని క్లస్టర్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో డీఈవో పాల్గొన్నారు. డిసెంబరు 5న ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి సమావేశం ఏర్పాటు చేయాలని చెప్పారు. అలాగే డిసెంబరు 6 నుంచి మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షలకు వంద రోజుల ప్రణాళిక సిద్ధం చేసుకుని వాటికి అనుగుణంగా విద్యార్థులకు బోధన చేయాలని ఆదేశించారు. ప్రధానంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీసీ రామకృష్ణ, హెచ్ఎం వెంకటరమణ, మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, కొత్తపల్లి క్లస్టర్‌కు చెందిన సంబందిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ఆత్మకూరురూరల్: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందని డీఈవో జనార్దన్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మన బడి మన భవిష్యత్తు స్కీం కింద ప్రభుత్వం నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను, దాత పరమేశ్వరరెడ్డి సహకారంతో నిర్మించిన స్టేజీని సర్పంచ్ మహానంది గంగాదేవితో కలిసి డీఈవో ప్రారంభించారు. పాఠశాలలోని మ్యాథమేటిక్స్ ల్యాబ్‌ను, విద్యార్థులు నిర్వహించిన మాక్ అసెంబ్లీ కార్యక్రమాన్ని తిలకించి విద్యార్థులను అభినందించారు. పదిలో ఉత్తీర్ణతా శాతాన్ని పెంపొందించేందుకు అదనపు తరగతులు నిర్వహిస్తుండటంతో ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవోలు మేరి మార్గరేట్, అయ్యూబ్‌అహ్మద్, విద్యా కమిటీ చైర్మన్ ఏరువ రమణారెడ్డి, టీడీపీ నాయకుడు రాజేంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

- సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభారాణి



సమావేశంలో సూచనలు చేస్తున్న న్యాయాధికారి శోభారాణి

నందికొట్కూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వచ్చేనెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభారాణి, జూనియర్ సివిల్ న్యాయాధికారి దివ్య సూచించారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. న్యాయాధికారి శోభారాణి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసుల్లో మధ్యవర్తిత్వం ద్వారా రాజీ చేసుకోవచ్చునన్నారు. పోలీసు అధికారులు కక్షిదారులకు అవగాహన కల్పించి, శాంతియుతంగా ఇరుపక్షాలను ఒకచోట చేర్చి తగాదాలను పరిష్కరించే వేదికగా లోక్ అదాలత్ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీపీ సుస్మిత, ఎస్ఐలు సిబ్బంది, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శరభయ్య, జూనియర్ , సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

'పది' పరీక్షా కేంద్రాల తనిఖీ



పరీక్షా కేంద్రాలను పరిశీస్తున్న డిప్యూటీ డీఈవో శంకరప్రసాద్

ఆత్మకూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి మండలంలో ఏర్పాటు చేయనున్న పరీక్షా కేంద్రాలను శనివారం డిప్యూటీ డీఈవో శంకర్ ప్రసాద్ పరిశీలించారు. ప్రత్యేకించి ఆయా పరీక్షా కేంద్రాల్లోని తరగతి గదులను సందర్శించి ఫర్నీచర్, వెలుతురు తదితర సదుపాయాలపై ఆరా తీశారు. మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని స్థానిక విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మెనూపాటించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈవో-2 అయ్యూబ్ అహ్మద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తాం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు
- ఎదురుపాడులో పలువురు పార్టీలో చేరిక



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మధు

కొత్తపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమిలో భాగంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ పోటీ చేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. శనివారం మండలంలోని ఎదురుపాడు గ్రామంలో సీనియర్ నాయకులు మల్లెల కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి ఆగస్త్య శంకర్‌గౌడు, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వంద మందికి పైగా కార్యకర్తలు, నాయకులు బీజేపీలో చేరారు. వీరికి అభిరుచి మధు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముందుగా కొత్తపల్లి బస్టాండు సెంటర్‌లో ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాయకులు మల్లెల కృష్ణారెడ్డి, విశ్వరూపాచారి, మౌలి బాషా, వెంకటరమణలను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు కాశెట్టి చంద్ర, పసుపుల రవికుమార్, సాంబశివరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'న్యాయ విచారణ జరిపించాలి'

నందికొట్కూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలని వామపక్షపార్టీల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో పట్టణంలోని వామపక్షపార్టీల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు మజీద్ మియా, పక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడితో డ్రైవింగ్ చేయొద్దు

నంద్యాల టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ చేసే సమయంలో డ్రైవర్లు ఒత్తిడికి గురికావద్దని ప్రముఖ వైద్యుడు డాక్టర్ హరినాథరెడ్డి సూచించారు. శనివారం స్థానిక నంద్యాల ఆర్టీసీ డిపో గ్యారేజీలో కార్మికులకు ప్రథమ చికిత్స, సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లపైనే ఉందన్నారు. ఎవరికైనా గుండెపోటు వచ్చినప్పుడు సీపీఆర్ ఎలా చేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

మహానంది, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ శాఖ డీఈ సురేష్‌బాబు తెలిపారు. శనివారం నందిపల్లి నుంచి బోయలకుంట్ల మీదుగా మహానందికి వెళ్లే రహదారిని ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు పరిశీలించారు. మలుపుల వద్ద సూచికల బోర్డులతో పాటు పెయింటింగ్‌లు వేయిస్తామని డీఈ తెలిపారు. అలాగే రాష్ట్ర హైవే, నేషనల్ హైవే అధికారులు సురేష్‌బాబు, డీఈఈ, ఆర్ అండ్‌బీ (నంద్యాల) రవిచంద్రతో పాటు నేషనల్ హైవే జెఈ మునిస్వామి బృందం పరిశీలించింది.

నిబంధనలు పాటించాలి

- ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా

నంద్యాల టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత ప్రమాణాలు, ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా అన్నారు. శనివారం నలంద కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. నిబంధనలకు లోబడి వాహనాన్ని నడపాలని సూచించారు. చాబోలు, వెంకటేశ్వరాపురం వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించి స్పీడ్ బ్రేకర్స్, స్టాపర్స్ బోర్డును డేంజర్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

నాగన్న మృతి పార్టీకి తీరని లోటు

బండిఆత్మకూరు నవంబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం మాజీ సర్పంచ్ నాగన్న మృతి పార్టీకి తీరనిలోటని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ రెడ్డి ఆయన సతీమణి మాజీ సర్పంచ్ సునీత అన్నారు. శనివారం నాగన్న మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. పార్టీ ఆవిర్భావం నుంచి పని చేశారన్నారు. బాధితకుటుంబ సభ్యులకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

రికవరీ ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల రూరల్ నవంబరు22(ఆంధ్రజ్యోతి): కొటక్ మహేంద్ర బ్యాంకులో రికవరీ ఏజెంట్లపై చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. రికవరీ ఏజెంట్లపై చర్యలు తీసుకోకుండా రైతులు ఈఎంఐలు చెల్లించాంటూ నోటీసులు పంపించడం దుర్మార్గమన్నారురైతులకు డబ్బులు తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత బ్యాంకు వారిపై ఉందన్నారు. లేని పక్షంలో రైతులతో కలిసి ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్ పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు
- గాంధీచౌక్‌లో ప్రభుత్వ ఉత్తర్వు కాపీలు దహనం



నంద్యాలలో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

నంద్యాల రూరల్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌ల విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం గాంధీచౌక్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉత్తర్వు కాపీలను దహనం చేశారు. నాగరాజు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్ విధానాన్ని రద్దు చేసి 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిహార్ ఎన్నికల అనంతరం మళ్లీ నాలుగు లేబర్ కోడ్ విధానాన్ని కేంద్రం తెరమీదికి తెచ్చిందన్నారు. చట్టాలను అమలు చేయాలని రాష్ట్రాలకు నోటిపై పంపడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి వెంకటలింగం, జైలాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు పాతబస్టాండ్‌లో..

ఆత్మకూరు: కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ ప్రయోజనం కోసం నూతన కార్మిక చట్టాలను అమల్లోకి తీసుకురావడం అన్యాయమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ అన్నారు. శనివారం స్థానిక పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట కార్మిక చట్టాల ఉత్తర్వులను దగ్ధం చేస్తూ నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడేందుకే నూతన కార్మిక చట్టాలు చేసిందన్నారు. కార్మిక సంఘాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా మొండిగా వ్యవహరించడం తగదని అన్నారు. నూతన చట్టాల రద్దుకు కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రణధీర్, సుబ్బయ్య, రఫీ, సలాం, వీరన్న తదితరులున్నారు.



ఆత్మకూరులో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

నందికొట్కూరు కేజీ రోడ్డులో..

నందికొట్కూరు: కార్మికుల హక్కులను హరించడం తగదని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రఘురామ్మూర్తి అన్నారు. పట్టణంలోని కేజీ రోడ్డుపై ఏఐటీయూసీ పట్టణ సమితి ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన లేబర్ కోడ్స్‌ను వ్యతిరేకిస్తూ ఈనెల 26న నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ నాయకులు హుస్సేన్, నాగేంద్ర, బాలస్వామి, కురువ రమేష్ పాల్గొన్నారు.

● కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను అమలు చేయడాన్ని నిరసిస్తూ జీవో ప్రతులను మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు నాగేశ్వరరావు అధ్యక్షతన దహనం చేశారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మికులకు ద్రోహం చేసే విధంగా కార్మిక చట్టాలను యజమానులకు అనుకూలంగా మార్చడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బాసిద్, నాగన్న పాల్గొన్నారు.

ఆది దంపతులకు ప్రత్యేక పూజలు



ఊయల సేవలో స్వామిఅమ్మవార్లు

శ్రీశైలం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు శనివారం మూలా నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. పల్లకి, ఊయలసేవ నిర్వహించినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఊయలసేవలో లలితా సహస్ర నామాలు పఠించి దర్శనాలు కల్పించారు. ఆలయ దక్షిణ మాడ వీధిలోని కళారాధన వేదికపై విశాఖపట్నం, విజయవాడకు చెందిన కళాకారులు నృత్యప్రదర్శ ఇచ్చారు. భక్తులు తిలకించారు.

శ్రీశైల దేవస్థానానికి వెండి వస్తువుల విరాళం

శ్రీశైలం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్ల నిత్య కైంకర్యాలకు ఉపయోగపడేలా వెండి వస్తువులను విరాళంగా ఇచ్చారు. శనివారం శ్రీశైలం కొత్తపేటకు చెందిన సుద్దాల మహేష్ కుటుంబసమేతంగా అమ్మవారి దర్శించుకున్నారు. అనంతరం ఆశీర్వచన మండపంలో 727 గ్రాముల వెండి పళ్లెం, గిన్నెను విరాళంగా పర్యవేక్షకులు గంజి రవి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, జూనియర్ అసిస్టెంట్ సావిత్రి అందజేశారు. దాతలకు స్వామిఅమ్మవార్ల శేషవస్త్రం తీర్థప్రసాదాలను ఇచ్చారు.

వ్యర్థాల రీసైక్లింగ్‌కు పక్కా ప్రణాళికలు: ఈవో

శ్రీశైలం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వ్యర్థాలను రీసైక్లింగ్ చేసేందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తామని ఈవో శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. శ్రీశైల క్షేత్ర పరిధిలో వ్యర్థపదార్థాలు ఉత్పన్నమయ్యే హోటళ్లు, నిత్యాన్నదాన సత్రాల వారు తడి, పొడిచెత్తను వేర్వేరుగా ఉంచేలా అవగాహన నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.

విద్యుత్ తీగలు చోరీ

గడివేముల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూజనూరు గ్రామంలో శనివారం గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ తీగలను అపహరించారు. రైతులు తెలిపిన సమాచారం మేరకు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి బోర్లకు వచ్చే విద్యుత్ తీగలను కట్ చేశారని అన్నారు. సుమారు రూ.50 వేలు వరకు నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో విద్యుత్ తీగలు చోరీకి పాల్పడిన ఘటనలు ఉన్నాయన్నారు. పోలీసులు నిఘా ఉంచాలని రైతులు కోరుతున్నారు.

డిసెంబరు 14న వారోత్సవ సభ

నంద్యాల టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని డిసెంబరు 14న వారోత్సవ సభ నిర్వహించనున్నట్లు రాయలసీమ దివ్యాంగుల సేవా సమితి అధ్యక్షుడు అన్నమయ్యగారి బాలసుబ్బయ్య తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు దుస్తులు, పరికరాలు, నిత్యవసర సరకులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో వెంకటేశ్వర్లు, చంద్రయ్యగౌడ్, మరియదాస్ పాల్గొన్నారు.

ఉల్లి పంటను దున్నేస్తున్న రైతులు



జూపాడుబంగ్లాలో ఉల్లి పంటను దున్నేస్తున్న రైతు నరసింహ

జూపాడుబంగ్లా, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం జూపాడుబంగ్లా గ్రామానికి చెందిన ఉల్లిరైతులు ధర లేకపోవడంతో పంటలను దున్నేశారు. 80బన్నూరు పొలిమేరలో రైతు నరసింహ ఎకరా పొలాన్ని దున్నేశారు. అలాగే వెంకటేశ్వర్లు అనే రైతు వదిలేయడంతో గ్రామస్థులు ఉల్లిగడ్డలను పొలానికి వెళ్లి తెచ్చుకున్నారు. ఉల్లిధర గిట్టుబాటు ధరలేకపోవడంతో వదిలేశామని ఎకరాకు రూ. లక్షవరకు నష్టం వచ్చినట్లు రైతులు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించారు.

ఆర్టీసీలో డబ్బులు స్వాహా

- చేతి వాటం ప్రదర్శించిన అకౌంటెంట్

నంద్యాల టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంస్థలో కీలకస్థానంలో విధులు నిర్వహించే ఓ ఉద్యోగి స్వాహా పర్వానికి తెరలేపాడు. ఎంతో నమ్మకంగా ఉండాల్సిన వాడే నిధులు గోల్‌మాల్ చేశాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారులు ఆడిట్‌కు ఆదేశించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న అకౌంటెంట్ డబ్బులను స్వాహా చేశాడు. కొంత మంది ఉద్యోగులు విజిలెన్స్‌కు ఫోన్ చేయడంతో విషయం బయటకు వచ్చింది. శనివారం విజయవాడ, తిరుపతి చెందిన అధికారులు నంద్యాల డిపోలో ఆడిట్ నిర్వహించారు. అకౌంటెంట్ డిపో డబ్బులు, వాహనాల ఎఫ్‌సీకి , చలనాలు కట్టాల్సిన డబ్బులు రూ.52 వేలు తన సొంతానికి వాడుకున్నారు. అయితే డబ్బులు ఏమైందని అధికారులు అడిగినప్పుడు ఇలా చేశానని చెప్పి రూ.52వేలను డిపో మేనేజర్ ఖాతాలో వేశారు. అకౌంటెంట్‌పై ఇప్పటికే చాలా ఆరోపణలు ఉన్నాయి. ఆర్టీసీ అధికారులను వివరణ కోరగా ఆడిట్ జరుగుతుంది. నివేదికను బట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

గ్లోబలైజేషన్‌లో సాంకేతిక పరిజ్ఞానమే ప్రధానం

శ్రీశైలం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గ్లోబలైజేషన్‌లో సాంకేతిక పరిజ్ఞానమే ప్రధానమని సుండిపెంట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్‌బాషా అన్నారు. ఐఏఎస్ అధికారి నారాయణ భరత్‌గుప్తా కళాశాల ల్యాబ్‌కు అందించిన పది కంప్యూటర్లను శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. బుచ్చయ్య, డాక్టర్ ఎం. పద్మ , అధ్యాపకులు ఇందిరా ప్రియదర్శిని, సాహిదా, మీనాక్షి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

క్లాప్‌మిత్రలు జాగ్రత్తలు పాటించాలి

జూపాడుబంగ్లా, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో పారిశుధ్య నిర్మూలనలో క్లాప్‌మిత్రలు జాగ్రత్తలు పాటించాలని సర్పంచ్ బాలమద్దిలేటి, టీడీపీ నాయకులు రాముడు తెలిపారు. పంచాయతీ నిధుల నుంచి పారిశుధ్యకార్మికులకు సెఫ్టీ దుస్తులు, టోపీలు, బ్లౌజులు అందజేశారు.

ఏజెంట్ల హవా..

(5వ పేజీ తరువాయి)

● ఇలా చాలా మంది ఆర్టీవో కార్యాలయంలో పని చేస్తూ ఏబీసీకి చిక్కి జైలు పాలయ్యారు. అయినా వీరిలో ఎలాంటి మార్పు రాలేదు.

ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు..

● కోవెలకుంట్లకు చెందిన ఒక వ్యక్తి ఇటీవల డ్రైవింగ్ స్కూల్ కోసం రాగా అతనికి రెన్యూవల్ చేయాలంటే ఏకంగా రూ.45 వేలు అధికారులు డిమాండ్ చేశారు. తెలిసిన వ్యక్తులతో చెప్పించి రూ.10వేలకు పని చేసినట్లు సమాచారం.

● నాలుగు రోజుల కిందట కొలిమిగుండ్లకు డ్రైవ్‌పై వెళ్లిన ఒక ఎంవీఐ, హోంగార్డు ఒక ట్రాక్టరును పట్టుకుని ఏకంగా అతని వద్ద నుంచి రూ.25వేలు తీసుకుని ఎలాంటి కేసు లేకుండా చేసినట్లు సమాచారం.

● సున్నిపెంటకు చెందిన కొందరు వ్యక్తులు వాహనానికి సంబంధించిన బదిలీకి ఇబ్బందులు ఉండడంతో నంద్యాలకు వచ్చారు. ఏజెంటు ద్వారా అతని వద్ద నుంచి కొంత మొత్తం వసూలు చేసి పని చేసినట్లు సమాచారం.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



నంద్యాల జిల్లాలోని రవాణా శాఖ కార్యాలయాల్లో అదనంగా, అక్రమంగా ఎవరైనా వసూళ్లచేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. బాధితులు నేరుగా వచ్చి ఫిర్యాదులు చేయాలి. వాహన దారులు కూడా ఎక్కడా అధికారులకు డబ్బులు ఇవాల్సిన పని లేదు. అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తే చర్యలు తప్పవు.

● శివారెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి, నంద్యాల

రాష్ట్ర స్థాయి పోటీలకు చాబోలు విద్యార్థులు



వరుణ్‌కుమార్



మన్సూర్

నంద్యాల హాస్పిటల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెన్సింగ్ పోటీలకు వైఆర్‌పీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చాబోలుకు చెందిన విద్యార్థులు మన్సూర్ , వరుణ్‌కుమార్ ఎంపికైనట్లు హెచ్‌ఎం భాస్కర్, వ్యాయామ ఉపాధ్యాయుడు నాగశేషు తెలిపారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ నెల 24నుంచి 26వరకు కోనసీమ జిల్లా నర్సాపూర్‌లో రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ నిర్వహించనున్నారు. అండర్-14ఫెన్సింగ్ పోటీల్లో విద్యార్థులు మన్సూర్ సాబ్రె, వరుణ్‌కుమార్ ఈపీ విభాగాల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా తరపున పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారులను ఉపాధ్యాయ బృందం, సీనియర్ క్రీడాకారుడు వినయ్ అభినందించారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పగిడ్యాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రగ్బీ, హ్యాండ్‌బాల్ పోటీలకు నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పి.పెద్ద నాగన్న తెలిపారు. కర్నూలు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేష ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్- 17 విభాగంలో కె. పవిత్ర(8వ తరగతి విద్యార్థిని) , అండర్ -14లో జ్యోతిప్రియ ,అండర్-17 హ్యాండ్‌బాల్ పోటీల్లో ఎస్. సబిత, అండర్ -14 కార్తీక్, షెనాజ్, వాసంతి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ నెల 28 నుంచి కడప, విజయవాడ, నెల్లూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రగ్బీ, హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులను, పీడీ చంద్రమోహన్‌ను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణ కిశోర్, వెంకట నాగులు తదితరులున్నారు.

'భవనాశి'కి గోల్డెన్ జ్యువెలరీ అవార్డు



అవార్డు అందుకుంటున్న నాగమహేష్

నంద్యాల కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవనాశి జువెలర్స్ అధినేత, ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు భవనాశి నాగమహేష్ ప్రతిష్టాత్మక గోల్డెన్ జ్యూవెలరీ అవార్డును అందుకున్నారు. శుక్రవారం విజయవాడలో నోవాటెల్‌లో యూనిటెల్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. 2025కు గోల్డెన్ జ్యూవెలరీ అవార్డును భవనాశి నాగమహేష్‌కు ఆంధ్రప్రదేశ్ బులియన్ గోల్డ్ సిల్వర్, డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కదలవాయు విజయకుమార్, స్టేట్ కన్వీనర్ శాంత్‌లాల్ జైన్, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా నంద్యాల బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు, కళారాధన నిర్వాహకులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రవికృష్ణ, సూరనసారస్వత సంఘం అధ్యక్షుడు డాక్టర్ గెలివి సహదేవుడు, లయన్స్ క్లబ్ సభ్యులు రవిప్రకాష్, రాజకీయనాయకులు, ప్రముఖులు, ఆర్యవైశ్యసంఘం నాయకులు అభినందనలు తెలిపారు.

టెట్ నుంచి మినహాయించాలి

ఆత్మకూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): టెట్ (టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్) నుంచి సీనియర్ ఉపాధ్యాయులను మినహాయించాలని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు కమతం శంకర్, ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, జిల్లా సహాధ్యక్షులు ఎంఎస్ ఉమ్మర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక థెరిస్సా జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో సంఘం నాయకులు విధుభూషణ్, రామాంజనేయులు, రామ్మూర్తి, ఆరీఫ్‌బాషా, దాసు, అనూష, చాముండేశ్వరీ, గురుస్వామి, వనం రమేష్, శివకృష్ణ, రంజిత్‌కుమార్, తరుణ్‌కుమార్, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ఏపీటీఎఫ్ మండల కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా అంబయ్య, ప్రధాన కార్యదర్శిగా వై.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, సుధాకర్, కేశవ ప్రసాద్, విజయలక్ష్మీ, అదనపు కార్యదర్శిగా భాస్కర్, కార్యదర్శులుగా శ్రీనివాస్‌నాయక్, మధు, షబాన, జకియా, రేణుక, జమ్రుద్, కరీంబాషా, సభ్యులను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులతో ఎన్నికల అధికారి ప్రతిజ్ఞ చేయించారు.

ఈకేవైసీ చేయించుకోవాలి



తంగడంచలో మల్లెతోటను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సూర్యనారాయణ

జూపాడుబంగ్లా, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి): ఉపాధిహామీలో జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీ ఈకేవైసీ చేయించుకోవాలని డ్వామా పీడీ సూర్యనారాయణ సూచించారు. మండలంలోని మండ్లెం గ్రామంలో సర్పంచ్ కృపమ్మ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ పనిచేసేవారు మాత్రమే జాబ్‌కార్డు తీసుకోవాలని సూచించారు. ఒకరిపేరుమీద మరొకరు పని చేస్తే కూలీలు రావన్నారు. ఉపాధిలో రైతులు కూడా పనులు చేయించుకోవాలని సూచించారు. అనంతరం తంగడంచలో మల్లెతోట, పండ్ల తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపికృష్ణ, ఏపీడీ దాసు, ఏపీవో రేష్మా ఉపాధి సిబ్బంది, శ్రామికులు, రైతులు పాల్గొన్నారు.

నేడు సాంఘిక నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు 'చైర్మన్' సాంఘిక నాటక ప్రదర్శన ఉంటుందని కళాక్షేత్రం అధ్యక్ష, కార్యదర్శులు పత్తి ఓబులయ్య, సి.యాగంటీశ్వరప్ప ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ రసరంజని నాటక సంస్థ నటీనటులు కె.కృష్ణమూర్తి, డొక్కా బాచి, అవినాష్, మోహన్ సేనాపతి, డాక్టర్ శ్రీజ సాదినేని, ఘణాపురం శశి, కేకే రెడ్డి తదితరులు నటిస్తున్నారన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే గౌరు చరిత



కల్లూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి శనివారం కలిశారు. విజయవాడలో కార్యాలయంలో సీఎంకు పాణ్యం నియోజకవర్గ సమస్యలను వివరించారు. స్పందించిన సీఎం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రేపు జిల్లాకు కాంగ్రెస్ కేంద్ర కమిటీ

కర్నూలు అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కేంద్ర కమిటీ ఈనెల 24 నుంచి నాలుగు రోజుల పాటు జిల్లాలో పర్యటించనుందని కాంగ్రెస్ కమిటీ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షుల నియామకంలో భాగంగా నియోజవర్గాల్లో పర్యటిస్తారన్నారు. సభ్యులు హెచ్‌సీ యోగేష్, సాకే శంకర్, సోటి నాగరాజు, సూర్య నాయక్ పర్యటించనున్నారని పేర్కొంది.

చిరుధాన్యాలపై అవగాహన సదస్సు



ఖాదర్ వలి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సి.క్యాంపు టీజీవీ కళాక్షేత్రంలో సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు చిరుధాన్యాలపై అవగాహన ఉంటుందని నిర్వాహకులు కడింపల్లి మోహన్ కుమార్, పోగుల సోమశేఖర్ ప్రకటనలో తెలిపారు. పద్మశ్రీ డాక్టర్‌ఖాదర్ వలి కొర్రలు, సామలు, అరికెలు, ఊదరలు, జొన్నలు, రాగులు తినడం వల్ల కలిగే లాభాలను వివరిస్తారన్నారు.

విజేతలుగా తిరిగి రావాలి



డ్రాగన్ బోట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సీనియర్ డ్రాగన్ బోట్ పోటీల్లో విజేతలుగా తిరిగి రావాలని అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గంగాధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి క్రీడాకారులకు సూచించారు. 24 నుంచి 27 వరకు మహారాష్ట్ర నాందేడ్‌లో నిర్వహించనున్న పోటీలకు రాష్ట్ర క్రీడాకారులు శనివారం కర్నూలు రైల్వేస్టేషన్ నుంచి పయనమయ్యారు. ఏపీ జట్టు మిక్స్‌డ్ విభాగంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. టి.ధోని, రాయ లిఖిత చౌదరి, కే.మోహిత్ రావ్, డి.ఆసిఫా నాజ్ (అనంతపురం), కమ్మరి శేఖర్, చెంచు వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ (కర్నూలు), దళిత రామచంద్రుడు (నంద్యాల), ఎన్.శివాజీ, పి.మోహన లక్ష్మి ప్రియాంక (ప్రకాశం) ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు

కర్నూలు క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తేజామూర్తి హెచ్చరించారు శనివారం కర్నూలు తాలుకా పోలీసులు తుంగభద్ర నది వద్ద గస్తీ నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచినా చర్యలు తప్పవన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కర్నూలు-దూపాడు రైల్వేస్టేషన్ల మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల మేరకు.. స్థానికులు సమాచారంతో రైల్వే పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 40-45 ఏళ్ల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. శరీరంపై నలుపురంగు ప్యాంట్, టవల్ ఉన్నాయని, ఆచూకీ తెలిసిన వారు 9908889696 నంబర్‌కు ఫోన్ చేయాలని సీఐ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు.

నిబద్ధతతో సేవలందించాలి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలు జీవన ప్రమాణాల్లో మార్పు వచ్చేలా నిబద్ధతతో సేవలందించాలని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న 16 మంది ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్, ఐఈఎస్ అధికారులు శనివారం కలెక్టర్‌తో సమావేశమయ్యారు. ఆదోని, ఎమ్మిగనూరు, మున్సిపాలిటీలు, మండలాల్లో వీరు పరిశీలించనున్నారు. జిల్లా ప్రాముఖ్యత, పారిశ్రామికాభివృద్ధి, అక్షరాస్యత, వివరాలను కలెక్టర్ వారికి వివరించారు. జడ్పీ సీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ సిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా వినతులు స్వీకరిస్తారని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన



మెడల్స్ సాధించిన క్రీడాకారులతో కలెక్టర్ సిరి

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలో నిర్వహించిన 12వ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు పతకాలు సాదించారు. శనివారం కలెక్టర్ డా.ఏ.సిరి క్యాంపు కార్యాలయంలో క్రీడాకారులను అభినందించారు. సీనియర్స్‌లో బి.వీరేష్ 65 కేజీల క్యాట్ గోల్డ్, పర్వేజ్ ముష్రాఫ్ 110 కేజీల క్యాట్ సిల్వర్, అండర్-14 విభాగంలో ఇంతియాజ్ 79 కేజీల క్యాట్, యూ-17 విభాగంలో 94 కేజీల కేటగిరిలో చాంద్‌బాషా , 94 కేజీల విభాగంలో హజరత్ వలి కాంస్య పథకాలను సాదించారు.

బోధనోపకరణాలు పంపిణీ



బాక్సులు ఇస్తున్న ఎంఈవోలు

సి.బెళగల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలలోని 1,2 తరగతుల విద్యార్థులకు బోధించడానికి ప్రభుత్వం 'జాదూయి పితారా' బాక్సులను అందజేసినట్లు ఎంఈవో-1 జ్యోతి తెలిపారు. శనివారం మండలంలోని 42 ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలకు వాటిని పంపిణీ చేశారు. ప్రభుత్వం 32 బోధనోపకరణాలు ఉంచిందన్నారు. వీటితో పిల్లలకు నాణ్యమన విద్య అందించవచ్చని తెలిపారు. ఎంఈవో-2 ఆదాం బాషా, హెచ్‌ఎంలు, వెంకటేశ్వర్లు, ఎంఆర్‌సీ రాజరావు ఉన్నారు.

కొలిమిగుండ్లతో సత్యసాయి అనుబంధం

- బాబా తల్లి ఈశ్వరమ్మ జన్మించింది ఇక్కడే
- గుర్తుగా శివాలయంలో ఆమె విగ్రహం
- నేడు సత్యసాయిబాబా శత జయంతి



సాయిబాబాతో తల్లి ఈశ్వరమ్మ (ఫైల్)




ఈశ్వరమ్మ పూజలు నిర్వహించిన శివాలయం

కొలిమిగుండ్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి ఆధ్యాత్మిక చక్రవర్తిని అందించిన సత్యసాయిబాబాకు కొలిమిగుండ్లతో విడదీయరాని అనుబంధమే ఉంది. సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరాంబ జన్మించింది కొలిమిగుండ్లలోనే కావడం విశేషం. దేశ విదేశాల్లో ఆధ్యాత్మిక చక్రవర్తిగా పేరుగాంచిన సత్యసాయిబాబా శత జన్మించి నేటికి సరిగ్గా వందేళ్లయింది. ఈసందర్భంగా సత్యసాయిబాబాకు కొలిమిగుండ్లతో ఉన్న అనుబంధంపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం. కొలిమిగుండ్లకు చెందిన సుబ్బరాజు, సుబ్బాయమ్మ దంపతుల కుమార్తె ఈశ్వరమ్మ. ఆమెకు తల్లిదండ్రులు పెట్టిన అసలు పేరు నామగిరాయమ్మ అయితే వివాహ అనంతరం మామ కొండమరాజు(సాయిబాబా తాత) ఆమెకు ఈశ్వరమ్మగా నామకరణం చేశారు. అయితే ఈశ్వరమ్మ వివాహానికి ముందే తమ సమీప బంధువులు కొండమరాజు పిలుపుమేరకు పుట్టపర్తికి తరలివెళ్లారు. అనంతరం కొండమరాజు పెద్ద కుమారుడు పెద్ద వెంకప్పరాజుతో ఈశ్వరమ్మ వివాహం జరిగింది. ఈదంపతులకు 1926 నవంబరు 23న కలిగిన సంతానమే భగవాన్ సత్యసాయిబాబా. తల్లిదండ్రులు పెట్టిన పేరు సత్యనారాయణరాజు. అయితే తన 14వ ఏటనే సత్యనారాయణరాజు అనంతపురం జిల్లాలో సత్యసాయిబాబాగా అవతరించారు. అనంతరం జిల్లా, రాష్ట్రం, దేశం ఇలా ప్రపంచ నలుమూలలా తన ఆధ్యాత్మిక ప్రసంగాలతో భక్తులను ఆకర్షించారు.

సత్యసాయిబాబాను ఈ లోకానికి అందించిన తల్లి ఈశ్వరమ్మ సైతం చిన్న నాటి నుంచి ఆధ్యాత్మికతతో ఉండేదని కొలిమిగుండ్లలోని పెద్దల ద్వారా తెలుస్తోంది. స్థానిక శివాలయంలో ఆమె తన చిన్నతనం నుండే నిత్యం పూజలు చేసేవారు. శివాలయాన్ని శుభ్రం చేయడంతో పాటు ఇతరులకు సహాయ సహకారాలు అందించేవారు. సత్యసాయిబాబా చిన్న పిల్లవాడుగా ఉన్న సమయంలో ఈశ్వరమ్మ ఆయనతో కలిసి, కొలిమిగుండ్ల శివాలయాన్ని పలుమార్లు సందర్శించారు. అందుకే ఆమెకు గుర్తుగా కొలిమిగుండ్ల గ్రామ పెద్దలు శివాలయంలో ఈశ్వరమ్మ విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. బాబా ఆధ్యాత్మిక ప్రపంచంలో తల్లి ఈశ్వరమ్మ సైతం మరణం వరకు ఆయన సేవలోనే తరించింది. పుట్టపర్తిలో అధునాతనమైన ఉచిత వైద్యం, విద్య, నీటి సరఫరా తన తల్లి ఈశ్వరమ్మ ఆకాంక్ష మేరకే ఏర్పాటు చేసినట్లు సత్యసాయిబాబా తన ప్రసంగాల్లో అనేకసార్లు వివరించడం గమనార్హం.

సత్యసాయిబాబా సంకల్పం : సత్యసాయిబాబా చివరి సమయంలో కొలిమిగుండ్లలో తన తల్లి ఈశ్వరమ్మకు గుడి నిర్మించాలని సంకల్పించారని అప్పట్లో ప్రచారం జరిగింది. దీనికి అణుగుణంగానే కర్నూలు జిల్లాకు చెందిన సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు కొలిమిగుండ్లకు చేరుకొని పెద్దలతో చర్చించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో 2007-09 మధ్య కాలంలో పలుమార్లు గ్రామంలో నగర సంకీర్తన, మహిళలకు చీరలు పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. దీంతో సత్యసాయిబాబా సంకల్పంతో కొలిమిగుండ్ల ఆధ్యాతిక కేంద్రంగా మారుతుందని అందరూ భావించారు. అయితే అనంతరం ట్రస్ట్ సభ్యులు ఈవిషయాన్ని అటకెక్కించారు. ఇదే సమయంలో 2011 ఏప్రిల్-24న భగవాన్ సత్యసాయిబాబా వారు శివైక్యం చెందడం జరిగింది. దీంతో బాబా సంకల్పం నెరవేరలేదని కొలిమిగుండ్ల వాసులు ఆవేదన చెందుతున్నారు.



గ్రామస్థులు శివాలయంలో ఏర్పాటు చేసిన ఈశ్వరమ్మ విగ్రహం

సామాజిక సేవలు విస్తరించాలి

సత్యసాయి సేవా సమితి జిల్లా కన్వీనర్ మాకా అశోక్‌కుమార్



నారాయణ సేవలో పాల్గొన్న సాయి సేవకులు

కర్నూలు కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి మార్గంలో భక్తులు సేవా కార్యక్రమాలను విస్తరించాలని సేవా సమితి జిల్లా కన్వీనర్ మాకా అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని నెహ్రూ నగర్ సత్యసాయి మందిరంలో 'నారాయణ సేవ' నిర్వహించారు. నగరంలోని బి.క్యాంపు ప్రభుత్వ దివ్యాంగ బాలుర వసతి గృహ విద్యార్థులకు అన్నందానం, జి పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని విభిన్న ప్రతిభా వంతుల వసతి గృహంలో పేస్టులు, టూత్ బ్రష్‌లు పంపిణీ చేశారు.

నేడు సత్యసాయి బాబా..

సీఎం చంద్రబాబు సత్యసాయి బాబా జన్మదినాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించినందున కలెక్టర్ డాక్టర్ సిరి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సత్యసాయి జన్మదిన వేడుకలు నిర్వహిస్తారని మాకా అశోక్ తెలిపారు.

బావిలో పడి యువకుడి మృతి

చాగలమర్రి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన శనివారం మండలంలోని పెద్దవంగలి చోటుచేసుకున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన సంతోష్ కుమార్(36) అనే యువకుడు మధ్యానికి బానిసయ్యాడు. గ్రామ సమీపంలోని బావిలో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. సంతోష్‌కుమార్‌కు రెండేళ్ల క్రితం వివాహమైంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య

చాగలమర్రి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల విద్యాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య తెలిపారు. శనివారం రాత్రి చాగలమర్రిలోని పీఆర్టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో ఉద్యోగులకు ఎప్పుడు జీతాలు పడతాయో తెలియని అయోమయం ఉండేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు వేతనాలు సకాలంలో పడుతున్నాయన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యారంగంలో మార్పులు తీసుకొచ్చి విద్యారంగానికి పెద్దపీట వేశారని అన్నారు. ఉపాధ్యాయుల హామీలను కూడా ప్రభుత్వం నెర వేరుస్తుందన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ రవింద్రారెడ్డి, మౌళాలి, ఓబుళపతి, దస్తగిరి, గురుచంద్రుడు, మహేంద్ర, హరినాథ్ రెడ్డి, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యార్థులకు శిక్షణ

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బి.క్యాంపు వృత్తి విద్యా కళాశాలలో శనివారం విద్యార్థులకు ఆన్ ది జాబ్ ట్రైనింగ్ నిర్వహించారు. జిల్లా వృత్తి విద్యా అధికారి డా.సురేష్‌బాబు మాట్లాడుతూ ఒకేషనల్ కోర్సుల్లో చదువుతున్న విద్యార్థులు నవంబరు, డిసెంబరు నెలలో క్రమ పద్ధతిలో ఆన్ ది జాబ్ ట్రైనింగ్ శిక్షణ పొందాలని తెలిపారు. ప్రాక్టికల్ నైపుణ్యాలు, పరిశ్రమ అనుభవంతో ఉద్యోగ ఉపాధి అవకా శాలు పొందవచ్చన్నారు. ఆర్ఐవో లాలెప్ప, కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

చాగలమర్రి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దూరు మెట్ట సమీపంలో 40వ జాతీయ రహదారిపై ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదే రహదారిలో వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున జరిగింది. వీఆర్ఎల్ ట్రావెల్స్ బస్సు కడప వైపు నుంచి నంద్యాలకు వెళ్తుండగా మద్దూరు మెట్ట సమీపానికి చేరుకోగానే అదే దారిలో వెళ్తున్న లారీని ఓవర్‌టెక్ చేయబోయి ఢీకొట్టింది. బస్సు డ్రైవర్ ప్రకాష్‌రెడ్డి గాయపడ్డాడు. డ్రైవర్‌ను 108లో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఎస్ఐ సురేష్, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

26న ప్యాసింజర్ రైలు దారి మళ్లింపు

మద్దికెర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు-హిందూపురం, హిందూపూర్- గుంతకల్ ప్యాసింజర్ రైలుకు ఈ నెల 26న రైలు దారి మళ్లింపు ఉంటుందని సౌత్ సెంట్రల్ రైల్వే సీఆర్వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. హిందూపూర్ వెళ్లే ప్యాసింజర్ రైలు గూళ్యపాలెం-వెంకటాంపల్లె మీదుగా వెళ్తుందని చెప్పారు. ఈ మార్పును ప్రయాణికులు గమనించాలని ఆయన సూచించారు. పాత కొత్త చెరువు రైల్వేస్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈ దారి మళ్లింపు చేపట్టినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

రుద్రవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అప్పనపల్లె గ్రామంలో శుక్రవారం రాత్రి విద్యుదాఘాతంతో 18 గొర్రెలు మృతి చెందినట్లు గురవయ్య అనే రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. గొర్రెల షెడ్డులో ఫ్యాను రెక్కలు ఊడి విద్యుత్ వైరుకు తగలడంతో ఒక్కసారిగా విద్యుత్ సరఫరా అయింది. పక్కనే ఉన్న యువకుడు గొర్రెలు అరుస్తుండగా వెళ్లి చూసి విద్యుత్‌సరఫరా నిలిపివేశాడు. 18 గొర్రెలుమృతి చెందడంతో రూ.2.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు. ఉపాధి కోసం తెచ్చుకున్న గొర్రెలు మృతి చెందాయని, ఆదుకోవాలని కోరారు.

ఎన్‌సీసీ విద్యార్థుల శ్రమదానం



చెత్తను తొలగిస్తున్న విద్యార్థులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీలక్ష్మీ పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు శనివారం శ్రమదానం చేశారు. నగరంలోని ఎన్ఆర్‌పేట తుంగభద్ర నదీ తీరాన రివర్‌బండ్ వద్ద చెత్తా.. చెదారాన్ని ఎత్తివేసి చేసి శుభ్రం చేశారు. ఎన్‌సీసీ అధికారి హరీష్ కుమార్ తెలిపారు. ఎన్‌సీసీ ఆఫీసర్ అశ్విని, 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

విజయ డెయిరీ రైతుల సంస్థ

- ఆదాయాన్ని రూ.15కోట్లకు పెంచాం
- చైర్మన్ ఎస్‌వీ జగన్మోహన్ రెడ్డి



కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విజయ డెయిరీ రైతుల సంస్థ అని చైర్మన్ ఎస్‌వీ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం కర్నూలులోని విజయ డెయిరీ ప్రాంగణంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, ఆమె సోదరుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి ఎలాగైనా విజయ డెయిరీని తమ సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వారి ఆటలు సాగనీయమని జగన్మోహన్ రెడ్డి హెచ్చరించారు. ఎమ్మెల్యే అఖిలప్రియ అసెంబ్లీలో తనపైన ఎన్నో ఆరోపణలు చేశారని, అవన్నీ అవాస్తవాలు అని చెబుతూ అందుకు రుజువుగా సంబంధిత పత్రాలను చూపించారు. చైర్మన్‌గా తాను డెయిరీని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఎన్నో కార్యక్రమాలు అమలు చేశామన్నారు. ఏడాదికి రూ.50లక్షల ఆదాయం ఉన్న సంస్థ ఆదాయాన్ని ప్రస్తుతం రూ.15కోట్లకు పెంచామన్నారు. రైతులకు బోనస్‌లు కూడా అందించామన్నారు. గతంలో చైర్మన్‌గా పని చేసిన నారాయణరెడ్డిపై ఒత్తిడి తెచ్చి రూ.1.40 కోట్ల రుణాన్ని భూమా అఖిలప్రియ తీసుకున్నారన్నారు. ఆరుణాన్ని కూడా విజయ డెయిరీకి వెంటనే చెల్లించాలని చెబితే తనపై పగ పెంచుకొని కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని ఆయన ఆరోపించారు.

పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

ఆలూరు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. శనివారం కర్నూలు జిల్లా ఆలూరు మండలం మొలగవల్లిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 3లక్షల రాష్ట్ర బడ్జెట్‌లో 40వేల కోట్లు నిధులు కేటాయిస్తే 3 ఏళ్లల్లో రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తవుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంకు కేంద్రం ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారన్నారు. కర్నూలు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వేదావతి, గురు రాఘవేంద్ర, ఆర్‌డీఎస్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అత్యంత వెనకబడిన కర్నూలు జిల్లా అని, ఇతర రాష్ట్రాలకు బతుకుదెరువు కోసం వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాక భూపేష్, సీపీఐ మండల కార్యదర్శి రామాంజనేయులు, సర్పంచ్ మోహన్‌రాజ్, అశోక్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ పూల రామాంజినేయులు, రంగన్న పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి



ల్యాబ్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

బేతంచెర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి ప్రభుత్వ వైద్యులకు సూచించారు. శనివారం మండలంలోని ఆర్ఎస్ రం గాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో ల్యాబ్ ఏర్పాటుకు ఎమ్మెల్యే కోట్ల స్థలాన్ని పరిశీలించారు. అలాగే మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ సచివాలయాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, వైద్యాధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం: మండలంలోని సిమెంటునగర్ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించామని ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డి అన్నారు. శనివారం సిమెంటునగర్‌లో తాగునీటి పైపులైన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని పైపులైన్ ప్రారంభించారు. టీడీపీ మండల నాయకులు, కార్యదర్శులు ఉన్నారు.

ఘనంగా హజరత్ హసన్ వలి ఉరుసు

డోన్ టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొండపేటలో వెలసిన హజరత్ హసన్ వలి ఉరుసు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈవేడుకలకు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి హాజరై స్వాముల వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనం తరం దర్గా ముజావర్లతో సమావేశమై వారి ఆశీర్వచనాలు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెద్ద కేశవయ్య గౌడు, మాజీ ఎంపీపీ శేషఫణి గౌడు, పట్టణ అధ్యక్షులు టీఈ రాఘవేంద్రగౌడు, రెహిమాన్, ఎలక్ట్రీషియన్ వలి, దస్తగిరి, కిరణ్ యాదవ్ పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

కొలిమిగుండ్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో వెలిసిన అయ్యప్పస్వామి దేవాలయంలో ఆదివారం ఆలయ 9వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు గురుస్వామి చంద్రమౌళిగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ అయ్యప్పస్వామికి మెట్ల పూజ, అభిషేకాలు, ప్రత్యేక హోమాలు, సాయంత్రం స్వామివారి పల్లకి ఉత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

అయ్యప్ప స్వాముల సంఘం అధ్యక్షుడిగా సుధాకర్ నాయుడు

ప్యాపిలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల అయ్యప్ప స్వాముల సంఘం అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన సుధాకర్‌నాయుడు నియమితులయ్యారు. అఖిల భారత అయ్యప్పస్వాముల సంఘం అధ్యక్షుడు పెం చలయ్య ఆధ్వర్యంలో కర్నూలులో శనివారం సుధాకర్‌నాయుడును నియమించారు. సుధాకర్ నాయుడు నియామకంపై స్థానిక అయ్యప్ప భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

నీటి పథకాలకు విద్యుత్ సరఫరా చేయాలి

ప్యాపిలి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రక్షిత తాగునీటి పథకాలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ఊటకొండ గ్రామస్థులు ఏడీ నాగేంద్రకు వినతి పత్రం అందజేశారు. శనివారం ఊటకొండ గ్రామాన్ని సందర్శించిన ఏడీకి గ్రామస్థులు మల్లికార్జున, నారాయణ, రాందాసు, పులిరాజ్, శ్రీనివాసులురెడ్డి తమ సమస్యలను విన్నవించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

డోన్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉడుములపాడు సమీపంలో నిర్మిస్తున్న శనైశ్చర స్వామి ఆలయ నిర్మాణానికి శనివారం డోన్ పట్టణం చెందిన ఎం.కన్వెన్షన్ ఫంక్షన్ హాలు అధినేత జి.శంకర్ గౌడు రూ.10 వేలు విరాళాన్ని ఆలయ పూజారి విహారి స్వామికి అందజేశారు. ఈ సందర్భంగా దాతను శాలువ కప్పి సన్మానించారు.

బెంచీల వితరణ

ఆళ్లగడ్డ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బెంచీలు, దుప్పట్లు శనివారం వితరణ చేశారు. మండలంలోని బత్తులూరు గ్రామంలోని బస్‌స్టాప్ వద్ద సత్యనారాయణ రూ.10వేల విలువ చేసే రెండు బెంచీలు అందజేశారు. అలాగే ఆళ్లగడ్డ పోస్టాఫీస్‌లో రూ.10వేల విలువ చేసే రెండు బెంచీలు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమం రోటరీ క్లబ్ గవర్నర్ ఎంకే రవీంద్ర, సభ్యులు పాల్గొన్నారు.

వరదల నుంచి పట్టణాన్ని రక్షిస్తాం

- ‘జుర్రేరు’పై ప్రొటెక్షన్ బండ్ నిర్మాణం
- ఆక్రమణలను పూర్తిగా అరికడుతాం
- రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



భూమి పూజ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వరదలు, భారీ వర్షాల నుంచి బనగానపల్లె పట్టణాన్ని రక్షించేందుకు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణ శివారులోని జుర్రేరు వాగు వద్ద రూ.6.9కోట్ల డీఎంఎఫ్ నిధులతో నిర్మిస్తున్న ప్రొటెక్షన్ బండ్ నిర్మాణ పనులను ఆయన భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు పట్టణంలోకి ప్రవేశించకుండా ఉండేందుకు ఈప్రాజెక్ట్‌ను రూపకల్పన చేసినట్లు చెప్పారు. జుర్రేరు వాగు ఆక్రమణలను పూర్తిగా అరికట్టేందుకు సురక్షితమైన డ్రైనేజీ వ్యవస్థ స్థాపనకు ఈపనులు ఎంతో ఉపయో గపడ తాయన్నారు. ఎస్ఆర్‌బీసీ బ్రిడ్జి నుంచి పాతబస్టాండ్ వరకు 1250 మీటర్ల పొడవునా ఇరువైపుల బండ్ నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతంలో వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేసే విధంగా ప్రణాళిక రూపొంది స్తున్నట్లు వివరించారు. బండ్ నిర్మాణం పూర్తయితే భవిష్యత్‌లో 52వేల క్యూసెక్కుల వరద ప్రవాహాన్ని పట్టణం నుంచి దూరంగా మళ్లించే విధంగా ఈ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. జుర్రేరు వాగుకు ఇరువైపులా అంతర్గత సిమెంట్ కాంక్రీట్ డ్రెయిన్ పనులను కూడా ఇప్పటికే పూర్తిచే సినట్లు చెప్పారు. పట్టణ డ్రైనేజీ నీరు వాగులో కలవకుండా నిరోధించేందుకు కట్టలు, డ్రైనేజీ వ్యవస్థ కీలకమన్నారు. బనగానపల్లె పట్టణంలో పరిశుభ్రంగా ఉండేందుకు దోహదపడుతోందన్నారు. కార్యక్రమంలో మైనర్ ఇరిగేషన్ ఏఈ రామ్మోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఖాశీంబాబు, అల్తాఫ్ హుసేన్, శేఖర్ పాల్గొన్నారు.

విత్తన శుద్ధి తప్పనిసరి

కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బాలరాజు



రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త బాలరాజు

రుద్రవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పంట సాగులో రైతులు విత్తనశుద్ధి తప్పనిసరిగా పాటించాలని బనగానపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బాలరాజు అన్నారు. శనివారం మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో యాగంటిపల్లె కేవీకే బృందం జిల్లా వనరుల కేంద్రం అధికా రులు సంయుక్తంగా రబీలో రైతులు సాగు చేసే పంటలపై ఏవో సుమతి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. శాస్త్రవేత్త సుధాకర్ మాట్లాడుతూ రైతులు ఒకే పంట సాగు చేయకుండా పంట మార్పిడి చేయాలన్నారు. పంట మార్పిడితో కొన్నిరకాల తెగుళ్లను నివారించవచ్చునని అన్నారు. మొక్కజొన్నకు ప్రత్యామ్యాంగా మినుము, ఆముదాల పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. శాస్త్రవేత్త బాలరాజు మాట్లాడుతూ వరిలో విత్తనశుద్ధి కోసం ఒక కేజీ విత్తనానికి 8 నుంచి 10 గ్రాముల సూడోమోనాస్ కలిపి విత్తనం చల్లుకున్నట్లయితే నారుమడిలో అగ్గితెగుళ్లను నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సంచాలకుడు చెన్నయ్య, ఏవో వెంకటేశ్వర్‌రెడ్డి, కేవీకే విస్తరణ శాస్త్రవేత్త రవిగౌడ్, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, ఏఈవోలు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవాలి

సీఎంను కోరిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



చంద్రబాబుకు సమస్యలు విన్నవిస్తున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. శనివారం విజయవాడలో చంద్రబాబుని కలిసి ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సీఎం స్పందించి చనిపోయిన కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని షాదిఖానాకు ప్రహరీ మంజూరు చేశారని చెప్పారు. అలాగే తుఫానుతోనష్టపోయిన రైతులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

సర్వేను త్వరగా పూర్తి చేయాలి

ఆళ్లగడ్డ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో అవాస్ ప్లస్ సర్వేను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి హరిగోపాల్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్వే పనులను ఈనెల 30 తేదీ లోపల పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్, హౌసింగ్ అధికారులకు సూచించారు. అలాగే మండలంలోని బాచేపల్లె, మర్రిపల్లె, ఆర్ కృష్ణాపురం కోటకందుకూరు గ్రామాల్లో నిర్వహిస్తున్న అధార్ సెంటర్‌లను కూడా తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీడీవో నూర్జాహాన్, హౌసింగ్ ఏఈ కొండయ్య, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యం

చాగలమర్రి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి మాధవిలత తెలిపారు. శనివారం మండలంలోని కేపీ తాండ గ్రామంలోని ప్రభుత్వ గిరిజన పాఠశాలను తనిఖీ చేశారు. ఆమె వెంట జిల్లా కో-ఆర్డినేటర్ జగన్ మోహన్‌రెడ్డి అలెస్కో అధి కారి ప్రసన్నకుమార్, ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, ఉపాధ్యా యులు ఉన్నారు.

26 అనుమానిత కేసుల గుర్తింపు

డోన్ రూరల్, నవంబరు 22(ఆంధ్రజోతి): మండలంలోని కొత్తబురుజు పీహెచ్‌సీ పరిధిలో 26 కుష్ఠు వ్యాధి అనుమానిత కేసులను గుర్తించినట్లు హెల్త్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని కొత్తబురుజు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఈనెల 17 నుంచి ఇంటింటికి వెళ్లి వైద్యులు పరీక్షలు చేశారన్నారు. వీటిలో 26 అనుమానిత కేసులు వచ్చాయని.. వాటిని పూర్తి స్థాయిలో పరీక్షించి వైద్యులు నిర్ధారణ చేస్తారన్నారు.

ప్రభుత్వ నిబంధనలు అనుసరించాలి

కొలిమిగుండ్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ప్రభుత్వ నిబంధనలను తప్పసరిగా అనుసరించాలని మండల విద్యాధికారి అబ్దుల్ కలాం అన్నారు. శనివారం మండలంలోని అంకిరెడ్డిపల్లె, కొలిమిగుండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించారు. ఈసందర్భంగా నూతన ఉపాధ్యాయులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

అంధకారంలో అహోబిలం

ఆళ్లగడ్డ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో అంధకారం నెలకొంది. గ్రామంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి పోలీస్ అవుట్ పోస్టు వరకు ఒక్క వీధిలైటు లేకపోవడంతో రాత్రి సమయంలో వీధి లైట్లు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయితీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.



అహోబిలంలో వీధిలైట్లు లేక అంధకారం నెలకొన్న దృశ్యం

మాక్ అసెంబ్లీకి డోన్ విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని సుసన్న

డోన్ టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో ఉన్న డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పి.సుసన్న రాష్ట్ర స్థాయి మాక్ అసెంబ్లీకి ఎంపికైనట్లు మండల విద్యా శాఖ అధికారి ప్రభాకర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి మాక్ అసెంబ్లీకి రాష్ట్రంలోని నియోజకవర్గంలో ఒక్కొక్కరి చొప్పున ఎంపిక చేయగా.. డోన్ పట్టణానికి చెందిన మున్సిపాలిటీలో పని చేస్తున్న మేస్త్రీ మేస్త్రీ దేవదానం, వరలక్ష్మిల కూతురు పి.సుసన్న ఎంపికైందని తెలిపారు. ఎంపికైన విద్యార్థిని ఈ నెల 26న అమరావతిలో మాక్ అసెంబ్లీ నిర్వహించే కార్యక్ర మంలో పాల్గొంటుందని తెలిపారు. విద్యార్థిని సుసన్నను ప్రిన్సిపాల్ ఎం ఈ గీత, వైస్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మావతి, సుస్మిత, ఆర్.ఆదిలక్ష్మి, ప్రభావతి, జ్యోతి, రాధిక, ఇందిరమ్మ, స్వరూప పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కోవెలకుంట్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆళ్లగడ్డ క్రాస్‌రోడ్డు వద్ద నంద్యాల ఎంవీఐ తిమ్మరుసు నాయుడు వాహనాలను తనిఖీ చేసి 11 కేసులు నమోదు చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని పేరా బిల్డింగు సమీపంలో ఆళ్లగడ్డ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేయగా సర్టిఫికెట్లు, లైసెన్సు, రోడ్డు పర్మిట్ లేని సుమారు 11 వాహ నాలపై కేసులు నమోదు చేసి రూ.76వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఎంవీఐ ప్రదీప్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పాడిపరిశ్రమ అభివృద్ధిపై సారించాలి

ఉయ్యాలవాడ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పశు వైద్యాధికారులు పాడి పరిశ్రమ అభివృద్ధిపై సారించాలని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యక్రమంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు వారి వారి ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. మొంథా తుఫాన్‌తో మండలంలో 228 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని మండల వ్యవ సాయ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు, ఆయా శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పకడ్బందీగా చేపట్టండి

ఉయ్యాలవాడ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రైతన్న ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దారు ప్రసాద్‌బాబు సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవ సాయ, రెవెన్యూ శాఖల సిబ్బందితో సమావేశమయ్యారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ నుంచి 29 వరకు రైతన్న ఇంటింటి సర్వే చేపడుతున్నామన్నారు. మండలంలోని సిబ్బంది ఆరు టీములుగా విడి పోయి సర్వే చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వ రరావు, ఏవో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బీపీఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బేతంచెర్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బీపీఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ హరిప్రసాద్ లబ్ధిదారులకు సూచించారు. శనివారం నగర పంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడూతూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ జారీ చేసిన జీవోఎంఎస్ 225 (12.11.2025) ప్రకారం అనుమతి లేకుండా నిర్మించిన భవనాలు, ఆమోదించబడిన ప్లాన్లకు విరుద్ధంగా నిర్మించిన భవనాలు (01.01.1985 నుంచి 31.08.2025 మధ్యలో నిర్మించినవి) మాత్రమే క్రమబద్ధీకరణ రెగ్యులరైజేషన్ చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

భూములు ఇప్పించండి

రుద్రవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తమ భూములు ఇప్పించాలని మండలంలోని ఆలమూరు గ్రామానికి చెందిన అంకాలమ్మ చెంచుగూడేనికి చెందిన రమణమ్మ, సుంకమ్మ అనే చెంచు మహిళలు కోరారు. శనివారం అమరావతిలో గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ మల్లిఖార్జుననాయక్‌ను వారు కలిసి వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ, అటవీ భూములు ఇప్పిస్తే తమ జీవనోపాధికి సహకరించిన వారవుతారని వినతిలో పేర్కొన్నారు.

ఏజెంట్ల హవా..!

(5వ పేజీ తరువాయి)

- ఇలా చాలా మంది ఆర్టీవో కార్యాలయంలో పని చేస్తూ ఏబీసీకి చిక్కి జైలు పాలయ్యారు. అయినా వీరిలో ఎలాంటి మార్పు రాలేదు.

ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు..

- కోవెలకుంట్లకు చెందిన ఒక వ్యక్తి ఇటీవల డ్రైవింగ్ స్కూల్ కోసం రాగా అతనికి రెన్యూవల్ చేయాలంటే ఏకంగా రూ.45 వేలు అధికారులు డిమాండ్ చేశారు. తెలిసిన వ్యక్తులతో చెప్పించి రూ.10వేలకు పని చేసినట్లు సమాచారం.
- నాలుగు రోజుల కిందట కొలిమిగుండ్లకు డ్రైవ్‌పై వెళ్లిన ఒక ఎంవీఐ, హోంగార్డు ఒక ట్రాక్టరును పట్టుకుని ఏకంగా అతని వద్ద నుంచి రూ.25వేలు తీసుకుని ఎలాంటి కేసు లేకుండా చేసినట్లు సమాచారం.
- సున్నిపెంటకు చెందిన కొందరు వ్యక్తులు వాహనానికి సంబంధించిన బదిలీకి ఇబ్బందులు ఉండడంతో నంద్యాలకు వచ్చారు. ఏజెంటు ద్వారా అతని వద్ద నుంచి కొంత మొత్తం వసూలు చేసి పని చేసినట్లు సమాచారం.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

నంద్యాల జిల్లాలోని రవాణా శాఖ కార్యాలయాల్లో అదనంగా, అక్రమంగా ఎవరైనా వసూళ్లు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. బాధితులు నేరుగా వచ్చి ఫిర్యాదులు చేయాలి. వాహన దారులు కూడా ఎక్కడా అధికారులకు డబ్బులు ఇవాల్సిన పని లేదు. అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తే చర్యలు తప్పవు.

- శివారెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి, నంద్యాల

రైతులకు ఉపయోగకరమైన పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న టీడీపీ కో-కన్వీనర్ వీఆర్ లక్ష్మీరెడ్డి

కొలిమిగుండ్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద రైతులకు ఉపయోగకరమైన పనులు చేపట్టాలని బనగానపల్లె నియోజకవర్గ టీడీపీ కో-కన్వీనర్ వీఆర్ లక్ష్మీరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో ఉపాధి కింద చేపట్టాల్సిన పనులపై గ్రామ సభ నిర్వహించారు. వీఆర్ లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పేద కూలీలకు వరమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివశంకర్, టీడీపీ నాయకులు వెంటకమల్లారెడ్డి, పెద్దిరెడ్డి, రామిరెడ్డి, రామలక్ష్మణ్ణ, పెద్దన్న, రామక్రిష్ణారెడ్డి, ఉపాధి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ ప్రథమ వార్షికోత్సవం

చాగలమర్రి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామ సమీపంలోగల అభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. వేద పండితులు మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, ఆకుపూజ చేశారు. మహిళలు, చిన్నారుల కోలాటం అందరిని ఆకట్టుకుంది. ఎస్ఐ సురేష్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

హోరాహోరీగా రాతిదూలం పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

చాగలమర్రి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు రాళ్లపల్లె అభయాంజనేయస్వామి ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా శనివారం ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీలను కమిటీ సభ్యులు రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలను ఆలయ కమిటీ సభ్యులు నరసింహారెడ్డి ప్రారంభించారు. నంద్యాల, కర్నూ లు, కడప, ప్రకాశం జిల్లాల నుంచి 10 జతల వృషభాలు పాల్గొన్నాయి. ఈ పోటీలో గెలుపొందిన ఎద్దులకు బహుమతులు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ. రూ.6 వేలు నగదును అందజేశారు.

ఎర్రమట్టి తవ్వకాలపై అధికారుల దాడులు

- నాలుగు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్

డోన్ రూరల్, నవంబరు 22(ఆంధ్రజోతి): పట్టణ సమీపంలోని గుడిటిప్ప ప్రాంతంలో ఎర్రమట్టి తవ్వకాలపై ఏడీఎంజీ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఎర్రమట్టి అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి డోన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో అప్పజెప్పారు. ఈ దాడుల్లో ఏడీఎంజీ ఆర్ఐ చిన్నప్పరెడ్డి, నవీన్ చంద్ర, వారి సిబ్బంది పాల్గొన్నారు.

డోన్ ఆర్టీసీ డీఎంగా ఎంవీ చలపతి



డోన్ టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఎంవీ చలపతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కర్నూలు ఆర్ఎం ఆఫీసులో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తూ పదోన్నతిపై డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్ బదిలీపై గుంతకల్లుకు వెళ్లారు. నూతన డీఎం ఎంవీ చలపతి మాట్లాడుతూ ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ప్యాపిలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ రామ్మోహన్‌యాదవ్ సూచించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో వారు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. సుధాకర్‌గుప్తా, రాంబాబు, పుల్లయ్య, రాము, బాలక్రిష్ణ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో వన సమారాధన

బనగానపల్లె, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్తీక వన సమారాధన శనివారం నిర్వహించారు. కళాశాలలో వృక్షశాస్త్ర అధ్యాపకురాలు వసుంధర ఆధ్వర్యంలో వారం రోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కార్తీక మాసం పాంప్లెట్, పర్యావరణ రక్షణపై పాంప్లెట్స్ పంపిణీ చేశారు. యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆయుర్వేద డాక్టర్ వాణి, ప్రిన్సిపాల్ లలిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

కోవెలకుంట్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అయ్యప్పస్వామి కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం త్రయార్షిక వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు గురుస్వాముల ఆధ్వర్యంలో మాలధారులు పట్టణంలోని కుందూ నది వద్దకు వెళ్లి పవిత్ర జలాలతో ఆలయం వద్దకు వచ్చారు. అయ్యప్ప స్వామి అష్టోత్తర శత కలశ స్నపనం, అష్టాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం అయ్యప్పస్వామి ప్రతిమను రథంపై ఉంచి పట్టణ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో గురుస్వాములు మురళీక్రిష్ణ, గడ్డం నాగేశ్వర్‌రెడ్డి, మాలధారులు చిట్టి, మహేశ్వర్‌రెడ్డి, వెలగటూరు ధనుంజయుడు పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు స్థల పరిశీలన

శిరివెళ్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): శిరివెళ్ల మేజర్ గ్రామ పంచాయతీలో వ్యర్థాలను తరలించేందుకు డంపింగ్‌యార్డ్ ఏర్పాటుకు రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి డైరెక్టర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, అధికా రులు శనివారం స్థలాన్ని పరిశీలించారు. శిరివెళ్ల నుంచి రుద్రవరం వెళ్లే ప్రధాన రహదారిలో డంపింగ్‌యార్డ్ ఉండటంతో వాహనదారులు, ప్రజ లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప, కార్యదర్శి అశ్విన్‌కుమార్, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, టీడీపీ నాయకులు సూరా రామ, పిదాహు సేన్, బాలచంద్రుడు, లింగమయ్య పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, అధికారులు